సాక్షి
నల్లగొండ

సోమవారం । 23 । జూన్ । 2025



ప్రభాకర్‌రెడ్డి.. ప్రతిభావంతుడు
దివంగత నటుడు, దర్శక–నిర్మాత డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 8లో



రాజకీయంగా ఎదగాలి
ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. - 8లో



విద్య, వైద్యం అందించాలి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్‌: క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24,25 తేదీల్లో విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన క్రీడల అధికారి ఎం.డి అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 24న బాలికలకు, 25న బాలురకు నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి వివరాలకు సెల్ : 8074487020 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్కూళ్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశం

నల్లగొండ: ఉపాధ్యాయులకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పి.వెంకులు అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు తనిఖీ బాధ్యతలు అప్పగించడం వల్ల ఆయా పాఠశాలల్లో బోధన స్తంభించిపోతుందన్నారు. మండల, ఉప విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులను నియమించి పాఠశాలల పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శివన్నగూడ రిజర్వాయర్ పనులు అడ్డగింత



ప్రాజెక్టు వద్ద పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్ పరిధిలో ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు తమకు ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామ సమీపంలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు అందరితోపాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నిర్వాసితులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్

నల్లగొండ టూటౌన్‌: ఫుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అక్బర్ అలీ అన్నారు. ఈ నెల 28 నుంచి జూలై ఒకటవ తేదీ వరకు నిజామాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదివారం ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.కర్తయ్య, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు బండారు ప్రసాద్, గిరిబాబు, కవిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవిత.. భరోసా!

'ప్రత్యేక' విద్యార్థులకు చేయూతనిస్తున్న భవిత కేంద్రాలు



నల్లగొండలోని భవిత కేంద్రం



మిర్యాలగూడలో ముస్తాబైన భవిత కేంద్రం

- సాధారణ విద్యార్థుల తరహాలోనే విద్యాబోధన
- కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- అందంగా ముస్తాబవుతున్న కేంద్రాలు
- కొన్నిచోట్ల కొనసాగుతున్న పనులు



మిర్యాలగూడలో భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

జిల్లాలో భవిత కేంద్రాలు	31
'ప్రత్యేక' విద్యార్థుల సంఖ్య	459

నల్లగొండ: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి. సాధారణ విద్యార్థుల తరహాలోనే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు కూడా విద్యాబుద్ధులు నేర్పిస్తూ.. మానసిక పరిపక్వత కార్యక్రమాలతో వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. జిల్లాలోని భవిత కేంద్రాలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక శ్రద్ధచూపుతూ బుద్ధిమాంద్యం, ఇతర దివ్యాంగ, మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులకు ఆయా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిత్యం సందర్శిస్తున్నారు.

సమాజంలో గౌరవించబడేలా..

అన్ని అవయవాలు సవ్యంగా ఉంటేనే బతకడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ కారణాలతో వైకల్యంతో జన్మించిన పిల్లల పరిస్థితి ఊహించలేనిది. అలాంటి వారిలో ఎక్కువగా మానసిక వైకల్యంతోపాటు ఇతర వైకల్యాలతో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. అలాంటి పిల్లలు సాధారణ పిల్లల తరహాలోనే విద్యాబుద్ధులు నేర్చుకుని సమాజంలో అందరూ గౌరవించేలా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిత కేంద్రాలను ఏర్పాటు చేశాయి. జిల్లాలో ఉన్న భవిత కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.కోటి 20 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే వివిధ సామగ్రి కొనుగోలు, వసతుల కల్పనకు రూ.72 లక్షలు విడుదల చేసి వివిధ పనులు చేపడుతున్నారు.

అవసరమైన చోట గదులు, ర్యాంప్‌ల నిర్మాణం

కలెక్టర్ ఆదేశాలతో 31 మండలాల పరిధిలో ఉన్న భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చోట్లలో ర్యాంప్‌లతో పాటు అదనపు గదులు నిర్మించారు. టాయిలెట్లను ఆధునీకరించారు. కేంద్రాల చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. పిల్లలను ఆకట్టుకునేలా కేంద్రాల్లోని గోడలపై రంగురంగుల బొమ్మలను పెయింటింగ్ వేసి అందంగా ముస్తాబు చేశారు. అలాగే ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీకి ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి బోధన సాగిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు తుది దశలో ఉన్నాయి.

ప్రత్యేక పిల్లలకు చేయూతనివ్వాలి



జిల్లాలో 700 మంది వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలున్నట్లు గుర్తించాం. వారందరూ భవిత కేంద్రాలకు వచ్చేలా తల్లిదండ్రులను ఒప్పిస్తాం. సాధారణ విద్యార్థుల మాదిరిగానే వారికీ విద్యాబుద్ధులు నేర్పే దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రత్యేక పిల్లలకు చేయూతనివ్వాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
– ఇలా త్రిపాఠి, కలెక్టర్

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు

- ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల దీవెనలుండాలి
- రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నకిరేకల్‌లో 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలతో లబ్ధిదారులు

నకిరేకల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి కళ్లలో వెలుగులు నింపుతున్నామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక ఆదాయంలో మిగులు రాష్టంగా ఉన్నా గత ప్రభుత్వం 8లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ప్రచారం చేశారు తప్పితే పేదలకు ఒక ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. మా ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..

కాంగ్రెస్ ప్రజా పాలనలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్యసాయాన్ని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. ఈ ఏడాది ఉగాది కానుకగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రైతు భరోసా కింది ఏడాదికి ఎకరాకు రూ.12 వేల చొప్పున గడిచిన తొమ్మిది రోజుల్లోనే రూ.9 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి ప్రజలు తేడాను గమనించి కాంగ్రెస్‌ను దీవించాలని కోరారు. ఎమ్మెల్యే వీరేశం కోరిక మేరకు నకిరేకల్, రామన్నపేటలో తహసీల్దార్ కార్యాలయ భవనాలకు వారం రోజుల్లో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఇళ్ల మంజూరులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం : భువనగిరి ఎంపీ చామల

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేదవారికి ఇళ్లు ఇవ్వడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. జిలా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా చేశామన్నారు. స్టీల్, సిమెంట్ తదితర సామగ్రి ధరల నియంత్రణకు మండల స్థాయిలో కమిటీలు వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీలు శంకర నాయక్, నెల్లికంటి సత్యం, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్, నాయణఅమిత్, ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్, జిల్లా పరిషత్ ఈసీఓ శ్రీనివాస్‌రావు, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజిత, వైస్ చైర్‌పర్సన్ ఉమారాణి, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, వివిధ మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి : మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనలు సడలించాలని సూచించారు. ధరణి పోర్టల్‌తో రైతులు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అధికార యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో సుఖేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నల్లగొండ, యాదాద్రి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు తదితరులు

అక్రమ డిప్యుటేషన్లు రద్దుచేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ : విద్యా శాఖలో అక్రమ డిప్యుటేషన్లను రద్దుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యుటేషన్లతో వెళుతున్నారన్నారు. డిప్యుటేషన్లను రద్దు చేయకపోతే డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం డిప్యుటేషన్లు వేయించుకుంటున్నారని ఆరోపించారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెంటనే వెనక్కి రప్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, బి.అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, వద్యా రాజు, ఎడ్ల సైదులు, సీహెచ్.అరుణ, సీహెచ్.రామలింగయ్య, గేర నరసింహ, ఎం.శ్రీనివాసరెడ్డి, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమరాజు సైదులు, వై.యాదగిరి, చిన్న వెంకన్న, వేదశ్రీ, మురళయ్య, నరసింహమూర్తి, భానుప్రకాష్, వరలక్ష్మి, ఎర్రనాగుల సైదులు, రాగి రాకేష్, గిరి యాదయ్య పాల్గొన్నారు.

కుల వ్యవస్థపై పోరాడాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

కట్టంగూర్ : సమాజంలోని పేదల ఐక్యతకు అడ్డుగోడగా ఉన్న కుల వ్యవస్థపై పోరాడాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కట్టంగూర్ మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. దళితులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్క లబ్ధిదారునికి రుణం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగ యువతకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఆ సంఘం ప్రతినిధులు కొండేటి శ్రీను, పెంజర్ల సైదులు, రెవిడాల పరుశురాములు, కోడిరెక్క రాధిక, వంటెపాక కృష్ణ, విజయ్‌కుమార్, గాదె నర్సింహ, దైద శ్రీను, బోళ్ల రవీంద్రకుమార్, దండు రవి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పోస్టు.. ఇద్దరు ఎస్‌ఈలు

- విధుల్లో ఉండేది మాత్రం ఒక్కరే..
- మరొకరు సంతకం పెట్టి జీతం తీసుకుంటున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- నల్లగొండ విద్యుత్ శాఖలో వింత వ్యవహారం



నల్లగొండ: నల్లగొండ విద్యుత్ శాఖలో వింత వ్యవహారం కొనసాగుతోంది. ట్రాన్స్‌కోలో ఇద్దరు ఎస్‌ఈలు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఒకరికి పదోన్నతి ఇచ్చి ఎస్‌ఈగా నియమించింది. ఆ తర్వాత పదోన్నతి తొలగించి మరో వ్యక్తిని బదిలీ చేసింది. దాంతో మొదటి అధికారి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుని అదే సీటులో కూర్చొగా బదిలీపై వచ్చిన అధికారి కూడా పక్క రూమ్‌లో సీటు వేసుకుని మరో ఎస్‌ఈగా కొనసాగుతున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర సీఈ పరిధిలో ఉన్నప్పటికీ పది నెలలుగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఒక పోస్టులో ఇద్దరు ఎస్‌ఈలు కొనసాగుతున్నారు.

అసలేం జరిగిందంటే..

ట్రాన్స్‌కోలో నల్లగొండ డీఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు పీహెచ్‌సీ ఆర్థో కోటాలో ప్రభుత్వం 2022 నవంబర్‌లో ఎస్‌ఈగా పదోన్నతి కల్పించింది. ఆ తర్వాత ఆయనకు ఇచ్చిన పదోన్నతిలో పొరపాటు జరిగిందని అది పీహెచ్‌సీ హెచ్‌హెచ్‌కు ఇవ్వాల్సిందని హరిప్రసాద్‌కు ఇచ్చిన పదోన్నతిని ఆ శాఖ అధికారులు 2024 ఆగస్టు 14న రద్దు చేశారు. దీన్ని సవాలు చేస్తు హరిప్రసాద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకుని ఎస్‌ఈగా కొనసాగుతున్నారు. అయితే హరిప్రసాద్ పదోన్నతిని రద్దుచేసిన వెంటనే నల్లగొండ ట్రాన్స్‌కో ఎస్‌ఈగా కె.నారాయణరెడ్డిని నల్లగొండకు బదిలీ చేశారు. దీంతో ఆయన విధుల్లో చేరినప్పటికీ ఎస్‌ఈ కుర్చీలో కూర్చొలేని పరిస్థితి. కోర్టు నుంచి స్టే తెచ్చుకున్న హరిప్రసాద్ సీట్లో కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బదిలీపై వచ్చిన నారాయణరెడ్డి పక్క గదిలో ప్రత్యేక కుర్చీ వేసుకుని కూర్చుంటున్నారు.

పది నెలలుగా ఇదే పరిస్థితి..

పది నెలల నుంచి ట్రాన్స్‌కోలో వింత పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌కో ఎస్‌ఈగా ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. అయితేన హరిప్రసాద్ నేరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగుల బదిలీలు, ఇతర అన్ని ఫైళ్లను ఆయనే చూస్తుండగా పదోన్నతిపై వచ్చిన నారాయణరెడ్డి మాత్రం పది నెలల నుంచి కేవలం విధుల వస్తూ సంతకం పెట్టి వేతనం తీసుకుంటున్నట్టు తెలిసింది. అయితే ఈ విషయమై ట్రాన్స్‌కో సీఈ లతను వివరణ కోరగా ఈ అంశం నా పరిధిలో లేదని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

- జూలై 29లోపు కమిటీలు వేయాలని ఆదేశం
- ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ పేరుతో ఏడు అంశాలపై ప్రచారం
- గతేడాది ఆశించిన స్థాయిలో రాని ఫలితాలు
- ఈ ఏడాది పక్కా కార్యక్రమాలకు కార్యాచరణ సిద్ధం

ప్రభుత్వ పాఠశాలలు	1,483
విద్యార్థుల సంఖ్య	61,073
ప్రైవేట్ స్కూళ్లు	369
విద్యార్థులు	1,25,572

నల్లగొండ : పచ్చదనం పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా మొక్కల ప్రాధాన్యంతోపాటు వివిధ అంశాలపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించేందుకు కేంద్ర విద్యా శాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులను పర్యావరణ సంబంధిత కార్యకలాపాల నిర్వహణలో వారిని భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వం ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనిపై ఈ క్లబ్‌లను ఈ విద్యాసంవత్సరం నుంచి 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'గా పిలవనున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ కొత్త క్లబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఇవి ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడం ఈ సంవత్సరం పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

ప్రతి స్కూల్ నుంచి ఒక కమిటీ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,483, ప్రైవేట్ స్కూళ్లు 369 ఉండగా ఆయా స్కూళ్లలో 1.86 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రతి పాఠశాల నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ ప్రజా ఉద్యమంగా చేపట్టిన ఏడు అంశాలలో ఎకో క్లబ్‌లను భాగస్వామ్యం చేస్తారు.

అవగాహన కల్పించే ఏడు అంశాలు ఇవే..

- ఇంధన పొదుపు
- నీటి పొదుపు
- సింగిల్ యూజ్ వాడొద్దు
- సుస్థిర ఆహార వ్యవస్థలు
- వృథాను అరికట్టడం
- ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం
- ఈ–వ్యర్థాలను తగ్గించడం.



వచ్చే నెలాఖరులోగా..

ఈ నెల 16 నుంచి వచ్చేనెల 29 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి తరగతి నుంచి చురుగ్గా ఉన్న నలుగురు లేదా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి టీచర్లను, పాఠశాల కమిటీ చైర్మన్‌ను క్లబ్‌లో భాగస్వాములు చేయనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు ఇందులో సభ్యులుగా ఉండాలి. ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు అంశాలకు సంబంధించిన యాక్టివిటీ ఫొటోలు, వీడియోలు తీసి ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలి.



యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో లక్ష పుష్పార్చన పూజ పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తులకు సుగంధ పరిమళాలు వెదజల్లే రంగురంగుల పుష్పాలు, తులసీదళాలతో అర్చన చేశారు. పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆ తరువాత గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో స్వామివారి వెండి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

చిట్యాల: చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ పొలం వద్ద నిల్వ చేసిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఓ వ్యక్తి స్కూటీపై చిన్నకాపర్తితో పాటు వెంబాయి, బోయగుబ్బ, మొగిదిదొరి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి చిన్నకాపర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద నిల్వ చేస్తూ వస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం పోలీసులు వ్యవసాయ పొలంపై దాడి చేసి సుమారు పది క్వింటాళ్ల(20 బస్తాలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

నల్లబెల్లం, పటిక పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొండమల్లేపల్లి: కారులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను శనివారం అర్ధరాత్రి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని హైదరాబాద్‌లో రోడ్డులో చెన్నారం గేటు వద్ద శనివారం అర్ధరాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా ఎక్సైజ్ అధికారులు ఓ కారును ఆపి తనిఖీ చేస్తుండగా.. డిండి మండలం బొగ్గులతోనకు చెందిన బాలకోటి కారును అక్కడే వదిలి పరారయ్యాడు. కారులో 660 కిలోల నల్లబెల్లం(22 బస్తాలు), 10 కిలోల పటికను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ రాకేష్, సిబ్బంది అయూబ్, శేఖర్ రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

వలిగొండ: రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం గొల్నేపల్లి సమీపంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్నేపల్లి–వలిగొండ గ్రామాల మధ్య రైల్లో నుంచి ఓ వ్యక్తి జారిపడి తీవ్రంగా గాయపడినట్లుగా రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. క్షతగాత్రుడి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా. తన పేరు విజయ్ అని, తనది మహారాష్ట్రలోని ఉదగిర్ గ్రామమని చెబుతున్నట్లు రైల్వే ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. అతడి తల, కాలుకు తీవ్ర గాయాలవ్వడంతో పూర్తి వివరాలు చెప్పలేకపోతున్నాడని పేర్కొన్నారు. ఈ మే రకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

అడ్డగూడూరు: వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై అడ్డగూడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన మేకల పవన్ శనివారం రాత్రి 11.30 గంటలకు ఇంటికి వెళ్తుండగా.. అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కొంతమంది గుమికూడటం గమనించి అక్కడకు వెళ్లాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన కప్పల రాజేష్‌తో పాటు అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన గూడెపు నాగరాజు, గజ్జెల్లి రవి కలిసి పవన్‌పై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో పవన్ చేతికి గాయాలయ్యాయి. తనపై దాడి చేసి, కులం పేరుతో దుషించారని ఆదివారం పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాగుబడి



సున్నం వేయించక ముందు..



సున్నం వేయించిన తర్వాత..

రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వలమల్ల జనార్దన్ తన సొంత ఖర్చులు రూ.11వేలతో పాఠశాలలోని తరగతి గదులు, ప్రహరీకి సున్నం వేయించి ఆదర్శంగా నిలిచారు. ఆయన గతేడాది జూలై 1న ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు. సహచర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సంఖ్యను 20 నుంచి 27కు పెరగడానికి కృషి చేశారు. - రామన్నపేట

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వలిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శనివారం రాత్రి వలిగొండ మండలం పులిగిల్లలో సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వేముల మహేందర్ నాల్గవ వర్ధంతి కార్యక్రమానికి జాన్ వెస్లీ హాజరై మహేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. సీపీఎం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తుందని.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈవిధంగా ఉచిత విద్య, వైద్యం అందించగలరా అని ప్రశ్నించారు. మధ్యతరగతి ప్రజలు అప్పు చేసి విద్య, వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు పెద్దఎత్తున సహకరిస్తున్నాయని ఆరోపించారు. మహేందర్ ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కార్యక్రమంలో ఎండీ జహంగీర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గణపతిరెడ్డి, నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కళ్లెం సుదర్శన్రెడ్డి, దొడ్డి భిక్షపతి, వేముల నాగరాజు, మారబోయిన నరసింహ, బుగ్గ అయిలయ్య, బుగ్గ చంద్రమౌళి, పైళ్ల వీరారెడ్డి, వడ్డమాని వెంకటయ్య, వడ్డెమాని మధు, బుగ్గ ఉదయ్, వేముల జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

బీబీనగర్: కారును వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా శనివారం రాత్రి జరిగింది.



రాజు (ఫైల్)



సత్యనారాయణ

సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన తంగెళ్లపల్లి సత్యనారాయణచారి (50), భువనగిరికి చెందిన ఎర్రోజు రాజు(42) కలిసి పని నిమిత్తం శనివారం హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా.. బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును అదుపుతప్పి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సత్యనారాయణచారి, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతిచెందాడు. ఆస్పత్రికి చేరుకున్నాక సత్యనారాయణ మృతిచెందాడు. మృతుల కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిన్నంటిన రోదనలు..


భువనగిరి: ఎర్రోజు రాజు, సత్యనారాయణచారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఉదయం ఆస్పత్రికి చేరుకోవడంతో వారి రోదనలతో మిన్నంటాయి. రాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకెళ్లారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ.. యువకుడి మృతి

- మరొకరికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో ఆదివారం జరిగింది. వన్‌టౌన్ సీఐ మోతీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం శూన్యంపహాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాల్మాన్ మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఇటీవల అతడికి పెద్దవూరకు బదిలీ కావడంతో కుటుంబంతో కలిసి అక్కడికి షిఫ్ట్ అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం సాల్మాన్ కుమారుడు అరుణ్(25), మరో వ్యక్తి రామకృష్ణ కలిసి స్కూటీపై సాగర్ రోడ్డు గుండా హాలియా వైపు వెళ్తుండగా.. ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో వెనుక నుంచి ధాన్యం లోడుతో వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న రామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ మోతీరాం ఘటనా స్థలానికి చేరుకుని అరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిన కంటైనర్



నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై అడ్డంగా పడిన కంటైనర్

వేములపల్లి: కంటైనర్ లారీ డివైడర్‌ను ఢీకొనడంతో కంటైనర్ రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ ఘటన నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై వేములపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీలో డ్రైవర్లు కాశీప్రభ, విజయ్‌రాజ్ నల్లగొండ నుంచి తమిళనాడుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రానికి చేరుకోగానే డ్రైవర్ కాశీప్రభ నిద్రలోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీపై గల కంటైనర్ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాశీప్రభకు స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్ రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న వేములపలఇ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని క్రేన్ల సహాయంలో కంటైనర్‌ను రోడ్డు పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్?

శాలిగౌరారం: మండల కేంద్రంలో గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిని విచారించగా.. కట్టంగూర్ మండలం నారెగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు కట్టంగూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆదివారం రాత్రి నారెగూడెం వెళ్లి గంజాయి విక్రయిస్తున్న వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పోలీసులకు చిక్కలేదు. పట్టుబడిన వ్యక్తిని కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరావల్సి ఉంది.

బోరు మోటార్ల వైర్లు చోరీ

మిర్యాలగూడ టౌన్: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశారు. ఈ ఘటన శనివారం రాత్రి మిర్యాలగూడ మండలం బోట్యానాయక్‌తండా పరిధిలో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బోట్యానాయక్‌తండాకు చెందిన రైతు, మాజీ సర్పంచ్ సాగర్‌నాయక్ శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా.. తన బోరు మోటారు వద్ద లైట్ వెలుగుతుడటం గమనించాడు. అక్కడికి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తి బోరు మోటారు వైరు చోరీ చేస్తూ కనిపించాడు. దీంతో సాగర్‌నాయక్ అతడిని నిలదీయగా ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. అనంతరం సాగర్‌నాయక్ బోరు మోటారు వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ బాక్స్‌లో ఫ్యూజు తొలగించడంతో పాటు మోటారు వైరును చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈవిధంగా తండా పరిధిలోని 30మంది రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లు చోరీకి గురవ్వడంతో ఆదివారం బాధిత రైతులంతా కలిసి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తి వదిలి వేసిన వెళ్లిన ద్విచక్ర వాహన్నాఇ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

- కోటిన్నర రూపాయలతో ఉడాయించిన వ్యక్తి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన 40మందికి పైగా బాధితులు

మిర్యాలగూడ అర్బన్: అందరితో పరిచయాలు ఏర్పచుకుని, నమ్మకంగా ఉంటూ చిట్టీలు కట్టించుకున్న వ్యక్తి సుమారు కోటిన్నర రూపాయలతో ఉడాయించాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శాంతినగర్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తి కాలనీవాసులను నమ్మించి 40మందితో చిట్టీలు కట్టించుకున్నాడు. మొదట్లో చిట్టీ డబ్బులు బాగానే ఇచ్చిన ఆయన.. కొద్దిరోజులుగా చీటీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో చిట్టీలు పాడిన వారు అతడి ఇంటి వద్దకు వచ్చి చూడగా తాళం వేసి ఉండటంతో చుట్టుపక్కల వారిని వాకబు చేశారు. సదరు వ్యక్తి కొద్దిరోజులుగా కనిపించడంలేదని చుట్టుపక్కల వారు తెలపడంతో.. అతడి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు మిర్యాలగూడ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సుమారు 40మందికి పైగా బాధితుల వద్ద కోటిన్నర రూపాయల వరకు వసూలు చేసి పారిపోయినట్లు తెలుస్తోంది. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమనర్సయ్య పేర్కొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా పూజల్లో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కాసబోయిన సత్యనారాయణ, యాదగిరి, మణికంఠ, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనూపాండే, శ్రీరాంపాండే తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడు

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత నటుడు, దర్శక–నిర్మాత డాక్టర్ ఎం. ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితంపై నల్లగొండ ఫిలిం సొసైటీ సెక్రటరీ పున్నమి అంజయ్య రచించిన పుస్తకాన్ని ఆదివారం గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసిన ఎం. ప్రభాకర్‌రెడ్డికి తెలుగు చిత్ర పరిశ్రమలో సరైన గౌరవం దక్కలేదని అన్నారు. ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితం గురించి పుస్తకం వెలువరించడం అభినందనీయమన్నారు. పుస్తక రచయిత పున్నమి అంజయ్య మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత నటులు కత్తి కాంతారావు, ఎం. ప్రభాకర్‌రెడ్డిలను గుర్తుచేసుకోకపోవడం ఎంతో బాధాకరమన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కత్తి కాంతారావు, ఎం. ప్రభాకర్‌రెడ్డి, హాస్యనటుడు



ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

వేణుమాధవ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి, 500 గజాల స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిలిం సొసైటీ సభ్యులు షఫీ, విద్యాసాగర్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, కోమలి కళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సభ్యులు వంగూరు భాస్కర్, తేజస్విని, సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పెందోట సోము, ప్రముఖ కవి రచయిత డాక్టర్ సాగర్ల సత్తయ్య, ఉనికి సంస్థ అధ్యక్షుడు బండారు శంకర్, విశ్వకర్మ సేవా సమితి కన్వీనర్ పగిడిమర్రి వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

సూర్యాపేట: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు ఎక్కువ స్థానాల్లో నిలబడి గెలిచి ప్రజలకు మరింత సేవలందించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. పేద ఆర్యవైశ్యులకు, ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా సంతోషిమాత దేవస్థాన కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంతోషిమాత దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బ్రాహ్మణపల్లి మురళీధర్, నూక వెంకటేశం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండారు రాజా, ఉపాధ్యక్షుడు గోపారపు రాజు, కోశాధికారి చెల్లా లక్ష్మీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఊరే లక్ష్మణ్, పప్పా ప్రకాష్, భువనగిరి విజయ్‌కుమార్, కొత్త మల్లికార్జున్, రాచర్ల కమలాకర్, వెంకటేశ్వర్లు, గుడిపాటి రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సంతోషిమాత దేవస్థాన కమిటీ సభ్యులు

వెంచర్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు

- ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని బాధితుల ఆరోపణ

చిట్యాల: ఐదేళ్ల క్రితం ప్లాట్లు విక్రయించి అగ్రిమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదేళ్ల క్రితం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో శ్రీనివాస టౌన్‌షిప్(కార్తికేయ వెంచర్) పేరుతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ టౌన్‌షిప్‌లో చిట్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30మంది వరకు ప్లాట్లు కొనుగోలు చేసి వెంచర్ డెవలపర్స్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇందుకుగాను ఒక్కొక్కరు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు టౌన్‌షిప్ నిర్వాహకులకు ఇచ్చారు. అనంతరం వెంచర్ డెవలపర్లు వివిధ కారణాలను చూపుతూ కొనుగోలు చేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా జాప్యం చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఆ వెంచర్‌లో ప్లాట్లకు రేట్లు పెరగడంతో ఇప్పటికే అగ్రిమెంట్ చేసుకున్న వారికి కాకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ.. ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఆ వెంచర్‌లో ఆదివారం సమావేశమయ్యారు. అనంతరం తమను మోసం చేసిన వెంచర్ డెవలపర్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలని చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బత్తుల జనార్దన్, లింగస్వామి, అయిలయ్య, సత్యనారాయణలతో మరికొందరు ఉన్నారు.



చిట్యాల పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు

బాతులే జీవనాధారం



భీమనపల్లి సమీపంలో రోడ్డు వెంట వెళ్తున్న బాతుల సమూహం

భూదాన్‌పోచంపలి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని మూసీ పరీవాహక గ్రామాల్లో ఎక్కడ చూసినా బాతులు సందడి చేస్తున్నాయి. ప్రతిఏటా వరికోతలు పూర్తవ్వగానే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల నుంచి పదుల కొద్ది కుటుంబాలు బాతు పిల్లలను తీసుకొని భూదాన్‌పోచంపల్లి మండలానికి వస్తుంటారు. మూసీ పరీవాహకంలోని కాలువలు, పొలాలలో బాతులను మేపుతూ వాటిని పెద్దచేసి గుడ్లు పెట్టే దశకు పెంచుతారు. రెండు నెలల పాటు ఇక్కడే ఉండి బాతు గుడ్లను సేకరించి మధ్యవర్తుల ద్వారా గుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక



సూర్యాపేట: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



గరిడేపల్లి: గురువును సన్మానించిన పూర్వ విద్యార్థులు

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో 1969లో హెచ్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 56 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకొని ఆనందంగా గడిపారు. ఆనాడు తమకు చదవు చెప్పిన గురువులు ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, ఎన్. సత్యనారాయణను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, రిటైర్డ్ టీచర్ గుండా రమేష్, పూర్వ విద్యార్థులు ప్రభాకరాచారి, వెంపటి వెంకన్న, అంజని, శ్రీనివాసరావు జయాకర్, వి. సూర్యనారాయణ, భాస్కర్, సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

41 ఏళ్ల తర్వాత..

గరిడేపల్లి: గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు జెడ్పీహెచ్ఎస్‌లో 1982–83 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 41ఏళ్ల తర్వాత ఒకచోట చేరి వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూలగుండ్ల సీతారాంరెడ్డి, ఈగ శ్రీనివాసరావు, కృష్ణ, ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, బండారు పిచ్చయ్య, నలబోలు సైదిరెడ్డి, ధనమ్మ, అలుగుబెల్లి సైదిరెడ్డి, గుమ్మిత నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.